సాక్షి వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 16 । జూన్ । 2024



వారపు సంత స్థలాలు కబ్జా

గుర్రంకొండలో వారపు సంత స్థలాలు కబ్జాకు గురయ్యాయి. దీంతో వారపు సంతలో దుకాణాలు నిర్వహించలేక వ్యాపారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. -8లో



కేసుల రాజీ కోసం కృషి చేయాలి

జిల్లాలో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేయాలని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం 35.2/26.2

వాతావరణం

జిల్లాలో శనివారం 26.2 – 35.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

‘స్పందన’ పేరు మార్పు

కడప సెవెన్‌రోడ్స్: ప్రతి సోమవారం కలెక్టరేట్ తోపాటు ఇతర కార్యాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమం పేరును మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్పందన పేరుకు బదులు ‘పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్’గా మార్పు చేశారు. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మీ కోసం అనే పేరు పెట్టారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక దాని పేరు స్పందనగా మార్పు చేశారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు అధికారంలోకి రావడంతో గ్రీవెన్స్‌సెల్‌గా మార్పు చేశారు.

యథావిధిగా ఖైదీల ములాఖత్

కడప అర్బన్: రాష్ట్ర ప్రధాన కార్యాలయం ప్రస్తుత ఉత్తర్వుల మేరకు ఎండతీవ్రత, వడగాల్పులు తగ్గుముఖం పట్టిన కారణంగా కడప కేంద్ర కారాగారంలోని నిందితులను, ఖైదీలకు ఇచ్చే ‘ములాఖత్’ (ఇంటర్వ్యూ)లను మునుపటి లాగానే ఉండనుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని రోజుల్లో నిర్వహించనున్నట్లు కడప కేంద్రకారాగారం సూపరింటెండెంట్ ఐఎన్‌హెచ్ ప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

జెడ్పీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా శారద



బాధ్యతలు స్వీకరిస్తున్న శారద

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ ఇన్‌చార్జి చైర్ పర్సన్‌గా శారద నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఆమెకు అందజేశారు. శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రొద్దుటూరు జెడ్పీటీసీగా ఆమె ఎన్నికయ్యారు. ఇప్పటివరకు జెడ్పీ వైస్ చైర్ పర్సన్‌గా వ్యవహరిస్తూ వచ్చారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట శాసనసభ్యునిగా ఎన్నికైన విషయం తెలిసిందే. దీంతో జెడ్పీ చైర్మన్ పదవికి ఖాళీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో శారదను ఇన్‌చార్జి జెడ్పీ చైర్ పర్సన్‌గా నియమించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, ఇతర సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.


ఆసుపత్రుల్లో సౌకర్యాల కల్పనకు కృషి



రిమ్స్‌లో కాన్పుల వార్డును పరిశీలిస్తున్న డాక్టర్ నీరద

కడప అర్బన్: కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో నిశ్చిత్ ప్లస్ టీబీ షేర్ ఇండియా ప్రతినిధి డాక్టర్ నీరద శనివారం పర్యటించారు. కాన్పుల విభాగం (లేబర్ వార్డు)తో పాటు, ఐసీయూ, మెడికల్, సర్జికల్, ఇతర విభాగాలను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖ తరపున ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలను అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారు. అనంతరం వైద్యులతో సమావేశమయ్యారు. ఆమె వెంట ఆర్ఎంఓ డాక్టర్ వై. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు 19 నుంచి కౌన్సెలింగ్



కడప రిమ్స్ వద్ద ఉన్న ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ

కడప ఎడ్యుకేషన్: ఏడాది, రెండేళ్ల పారిశ్రామిక శిక్షణ కోర్సుల్లో (ఐటీఐ) ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. కడప రిమ్స్ వద్ద పుష్పగిరి ఆసుపత్రి ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఐటీఐ మైనారిటీస్‌లో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల జిల్లా కన్వీనర్, మైనార్టీ ఐటీఐ ప్రధానాచార్యులు జ్ఞానకుమార్ తెలిపారు. 19వ తేదీ ఉదయం 9 గంటలకు 10 జీపీఏ నుంచి 7.4 జీపీఏ వరకు, 20వ తేదీ 7.3 జీపీఏ నుంచి 5.7 జీపీఏ వరకు, 21వ తేదీ ఉదయం 9 గంటలకు 5.6 జీపీఏ నుంచి 3 జీపీఏ వచ్చిన వారికి కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. మిగిలిన అన్ని సీట్లకు 22వ తేదీన జనరల్ పూల్ పద్ధతిలో 10 జీపీఏ నుంచి 3 జీపీఏ వరకు సీటు పొందని విద్యార్థులకు మరో మారు కౌన్సెలింగ్ నిర్వహించి సీటు కేటాయించనున్నట్లు చెప్పారు.ఇతర వివరాలకు 9989290960, 9502556741 నంబర్లలో కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు.

నాన్నా.. థ్యాంక్యూ..!

నేడు ఫాదర్స్ డే



అమ్మ ప్రేమతో పోల్చుకుంటే నాన్నెందుకో వెనుకబడ్డాడంటూ ఇటీవల సోషల్ మీడియాలో ఒక పోస్టు బాగా వైరల్ అయింది. బిడ్డకు నాన్న వెన్నెముకగా నిలుస్తాడు. వెన్నెముక శరీరంలో వెనుకభాగంలో ఉంటుంది. అందుకే వెనుకబడ్డాడంటూ నాన్న విశిష్టతను చివరిలో ఒక్క మాటలో చక్కగా ముగించాడు ఆ కవితలో. నిజమే.. బిడ్డ ఎదుగుదల వెనుక నాన్నే సర్వస్వం. ఒడిలో కూర్చోబెట్టుకుని ఓనమాలు నేర్పించింది మొదలు చేయి పట్టుకుని బుడి బుడి అడుగులు వేయిస్తూ... తర్వాత ప్రపంచాన్ని పరిచయం చేస్తాడు నాన్న. అందరి జీవితాల్లోనూ నాన్నది ఇదే పాత్ర. బిడ్డ ఎదిగే క్రమంలో ప్రతి అడుగులోనూ తానుంటాడు. లక్ష్యాన్ని ఏర్పరుస్తాడు. దాన్ని సాధించడానికి మార్గమూ చూపిస్తాడు. ఇలా తన జీవితాన్ని కన్న బిడ్డల కోసమే అంకితమిచ్చే నాన్నకు ఏమిచ్చి రుణం తీర్చుకోగలం. గుర్తు చేసుకోవడం తప్ప. నేడు ఫాదర్స్ డే. ఈ సందర్భంగా ‘సాక్షి’ ప్రత్యేక కథనం..


భారవి కథ

పురాణాల ప్రకారం...భారవి మహాకవి. బాల్యంలో ఎంత బాగా చదివినా తండ్రి అసంతృప్తి వ్యక్తం చేసేవాడు. భారవికి తండ్రిపై కోపం పెరిగింది. తండ్రిని మట్టుబెట్టాలనుకుని ఓ రాత్రి అందుకు సిద్ధమవుతాడు. ఆ సమయంలో తండ్రి పొగిడితే కుమారుని ఆయుష్షు తగ్గుతుందన్న భయంతో భారవిని ప్రశంసించలేదని, అందుకు బిడ్డ ఎంతగా బాధపడుతున్నాడోనని తండ్రి ఆవేదన వ్యక్తం చేస్తాడు. ఇది కుమారుడు భారవి వింటాడు. తండ్రి మనసు తెలుసుకోలేక పోయానని పశ్చాత్తాపంతో బోరున ఏడుస్తూ తండ్రి పాదాలపై వాలిపోతాడు.

కడప కల్చరల్/మదనపల్లె సిటీ: నాణేనికి రెండు ముఖాలు. అందులో బొమ్మ అమ్మ అయితే, బొరుసు నాన్న. జీవితంతో విడదీయలేని బంధం అది. ఆ వ్యక్తి లేని మన పుట్టుకను, జీవితాన్ని ఊహించుకోలేం. తల్లితో కలిసి ఆయన బిడ్డల అభివృద్ధికి పడే తపనను ఎవరూ వర్ణించలేరు. బిడ్డలు దినదినాభివృద్ధి చెందుతుంటే గుండెలనిండా సంతోషంతో పొంగిపోయే వ్యక్తి ‘నాన్న’. దేవుని తర్వాత అంతటి స్థానం అమ్మతోపాటు నాన్నకూ ఉంది. అమ్మను మమతానురాగాలకు ప్రతిరూపంగా భావించే మనం.. నాన్నను మాత్రం భయపెట్టే వ్యక్తిగా భావిస్తూ ఉంటాం. నిజానికి కుటుంబ పెద్దగా తన బాధ్యతల పట్ల తండ్రి స్పందన ఎలా ఉంటుందన్న విషయం చర్చించేందుకే ప్రతి సంవత్సరం జూన్ 3వ ఆదివారం తండ్రుల దినోత్సవంగా నిర్వహిస్తున్నాం.

తండ్రి విలువ తెలియాలి

రోజురోజుకు నైతిక విలువలు పతనమవుతున్న నేటి సమాజానికి తండ్రి విలువ తెలియాల్సిన అవసరం ఉంది. వయస్సు ఉడిగిన దశలో తల్లిని పనిమనిషిగా ఇంటిలో ఉంచుకుని పనికి రాడంటూ తండ్రిని బయటికి గెంటేస్తున్న సంఘటనలు చూస్తున్నాం. ఆస్తి కోసం కన్న తండ్రిని చంపిన సంఘటన అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం చోటుచేసుకోవడం దిగజారుతున్న మానవతా విలువలకు నిదర్శనం. పుత్రుడు పుడితే పున్నామ నరకం నుంచి తప్పిస్తాడని ఆనందపడిన తండ్రికి బతికి ఉండగానే నరకం చూపించే పుత్రరత్నాలు కూడా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉత్తమ సమాజ నిర్మాణంలో తండ్రికి గల కీలకమైన స్థానం, ఆయన త్యాగాల గురించి తెలియజెప్పి తండ్రి ఔన్నత్యం పట్ల అవగాహన పెంచాల్సిన ఆవశ్యకత ఉంది.



కొవ్వొత్తిలా కరిగిపోతూ..

అమ్మ మనకు ఉనికినిస్తే...నాన్న విలువ కల్పిస్తాడు. అమ్మ నవమాసాలు మోసి సంతానాన్ని, ఇంటిని చక్కదిద్దేందుకు కృషి చేస్తే నాన్న పెద్దదిక్కుగా ఆ తల్లీబిడ్డలతోపాటు మొత్తం కుటుంబానికి రక్షణగా నిలుస్తాడు. అమ్మకు కష్టం వస్తే నాన్నకు చెప్పుకుంటుంది. కరువు తీరా ఏడ్చి గుండె బరువు దించుకుంటుంది. కానీ తండ్రికి ఆ అవకాశం కూడా ఉండదు. ఇంటా, బయటా ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తండ్రి ఆ బాధను గుండెల్లోనే దాచుకుంటాడు. మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతాడు. అందుకే పక్షవాతం, గుండెపోటు లాంటి వ్యాధులు ఎక్కువగా పురుషులకే వస్తాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కుటుంబం కోసం అమ్మ వత్తిలా కాలిపోతే...నాన్న మైనంలా కరిగిపోతూ వెలుగునిస్తాడు.

క్రమశిక్షణ నేర్చుకున్నాను



మా నాన్న పేరు ఆలూరి శ్రీకర్. మదనపల్లెలో హోమియో వైద్యులు. ఆయన క్రమశిక్షణకు ఎంతో విలువ ఇచ్చేవారు. ఏ రోజూ దానిని అతిక్రమించేవారు కాదు. ఆ ప్రభావమే నాపై ఉంటుంది. ఏదైనా నిర్ణయం తీసుకుంటే దాన్ని నిబద్ధతతో పూర్తి చేయాలని చెప్పేవారు. ఆయన స్ఫూర్తి, ప్రోత్సాహంతోనే ఇంటర్మీడియట్‌లో 982 మార్కులు సాధించింది. తెలంగాణ ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు, ఈఏపీసెట్‌లో రాష్ట్ర స్థాయిలో నాల్గవ ర్యాంకు, నీట్‌లో జాతీయ స్థాయిలో 674వ ర్యాంకు వచ్చింది. నాన్న స్ఫూర్తితోనే డాక్టర్ చేయాలని ఉంది. –ఆలూరి ప్రణీత, ఈఏపీసెట్ రాష్ట్ర స్థాయి ర్యాంకర్

వెన్ను తట్టి ప్రోత్సహించారు

మాది మదనపల్లె పట్టణం ఈశ్వరమ్మ కాలనీ. నాన్న పేరు షేక్ అహ్మద్‌బాషా.చిరు వ్యాపారి. నా అభిరుచికి అనుగుణంగానే చదువుకోమని స్వేచ్ఛ ఇచ్చారు. ఆయన సమక్షంలోనే నా బాల్యం బాగా సరదాగా గడిచింది. ఆయనే నాకు గురువు. ఎప్పుడూ చిరునవ్వుతో ఉండేవారు. చదువే ముఖ్యమని తరచూ చెప్పేవారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని పదే పదే హిత బోధ చేసేవారు. ఆయన ప్రోత్సాహంతోనే బీటెక్ పూర్తి చేసిన తరువాత సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాను. మొదటిలో ర్యాంకు రాకపోవడంతో నాన్న ఎంతో ధైర్యమిచ్చారు. ఆ ధైర్యంతోనే రెండోసారి 2022లో సివిల్స్ రాశాను. సివిల్స్ పరీక్ష ఫలితాల్లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యాను. మా నాన్నే నాకు హీరో.. ఆయనే స్ఫూర్తి. –షేక్ ఆయిషా,డిప్యూటీ కలెక్టర్ (ట్రైనింగ్)



తల్లిదండ్రులు షేక్ అహ్మద్‌బాషా, గౌసియాబేగంతో షేక్ ఆయిషా

కొండంత అండగా..

నాన్న పేరు శ్రీనివాసులు. ఓ పత్రికలో విలేకరిగా పని చేస్తున్నారు. నాన్నే నాకు కొండంత అండగా ఉండేవారు. మాకు మానసికంగా ధైర్యం చెప్పేవారు. చదువుతోనే అభివృద్ధి చెందవచ్చని నిరంతరం నూరిపోసేవారు. రోజూ రాత్రి పూట ఏకాంతంగా ఉంటుందని శ్రద్ధగా చదివించేవారు. ఏవైనా అనుమానాలు వస్తే వెంటనే వాటిని నివృత్తి చేసేవారు. నాన్న నాకు ఓ మార్గదర్శి. నాన్న వల్లే నాకు పదిలో 597 మార్కులు వచ్చాయి. రాష్ట్ర స్థాయిలో ర్యాంకు రావడంతో మా నాన్న ఎంతో సంతోషించారు. –జె.శ్రావణి, టెన్త్ స్టేట్ టాపర్



తల్లిదండ్రులతో జె.శ్రావణి

గురువుగా...శిష్యునిగా....



మా నాన్నది ఉమ్మడి కుటుంబం. ఆయన పెద్దగా చదువుకోకపోయినా కుటుంబంతోపాటు గ్రామమంతా తన కుటుంబంగానే ఆప్యాయంగా భావించేవారు. పర్వదినాల్లో నాటకాలు వేయాలని ఆయన ముచ్చటపడగా...నేను భారతంలోని కొన్ని ఘట్టాలను ఆయనకు నేర్పేవాడిని. ఆయన నాకు ఇచ్చిన ఆస్తి సంప్రదాయాలు, సంస్కృతి, మానవత్వం, విలువలు. ఇవే పంచ ప్రాణాలుగా నన్ను నేటికి నడిపిస్తున్నాయి. – ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి, వైవీయూ

తొలి గురువు



నాన్నే నాకు తొలి గురువు. బాల్యంలో ఆయన కూలీ పని చేస్తుండగా నేను పక్కనే ఉండేవాడిని. నాకు విసుగు కలగకుండా ఆయన చేలోని తడి మట్టితో బొమ్మలు చేసి ఇచ్చేవారు. ఆ స్ఫూర్తితోనే నేను అంతర్జాతీయ స్థాయిలో శిల్పకారుడిగా పేరొందాను. అదే జీవనంగా గడుపుతున్నాను. ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో దేశ నాయకుల విగ్రహాలను భారీ స్థాయిలో చేసి ఆవిష్కరిస్తున్న సమయంలో నాకు నాన్న గుర్తు వస్తారు. – గొల్లపల్లి జయన్న, శిల్పకారుడు, బద్వేలు

కడపలో మెరిసిన నిధి



బంగారు నగలతో నిధి అగర్వాల్, ఎమ్మెల్యే మాధవిరెడ్డి, షోరూం యాజమాన్యం

కడప కల్చరల్: కడప నగరంలో మరో కార్పొరేట్ నగల దుకాణం వెలిసింది. ఆర్టీసీ బస్టాండు వద్ద జోస్ ఆలుక్కాస్ షోరూంను శనివారం ప్రముఖ సినీ నటి నిధి అగర్వాల్, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డితో కలిసి ప్రారంభించారు.సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జాన్ ఆలుక్కాలు వారికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. నిధి అగర్వాల్ మాట్లాడుతూ తానుకడపకు రావడం ఇదే తొలిసారి అని, సంప్రదాయ, ఆధునిక నగల కలెక్షన్స్‌తో షోరూం తన పేరును ఇనుమడింపజేసుకుందన్నారు. ఇది కడప నగరానికి శోభ ఇవ్వగలదని కొనియాడారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి బ్రాడెండ్ నగల షోరూంలు మరిన్ని కడప నగరానికి రావాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ప్రారంభోత్సవ సందర్భంగా జోస్ ఆలుక్కాస్ షోరూం ప్రత్యేక ఆఫర్లను అందిస్తోందన్నారు. నేటి నుంచి జులై 21 వరకు ప్రత్యేక ఆఫర్లలో భాగంగా రూ. 60 వేలు విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాల కనీస కొనుగోలుపై కస్టమర్లకు బంగారు నాణేన్ని అందజేస్తామన్నారు. అదనంగా వజ్రాలపై 20 శాతం, ప్లాటినం ఆభరణాలపై ఏడు శాతం తగ్గింపు ఉందన్నారు. బంగారు ఆభరణాల తరుగు ఛార్జీలపై 50 శాతం తగ్గింపు ఉందని, ఈ షోరూంలో ప్రతి కొనుగోలుపై ఒక ఉచిత బహుమతి ఇస్తామన్నారు. ఈ సందర్భంగా అభిమానులు సినీనటి నిధి అగర్వాల్‌తో మాట్లాడాలని, సెల్ఫీలు, కరచాలనం తీసుకోవాలని కోరారు. యాంకర్ మరీమరీ కోరడంతో నిధి అగర్వాల్ కొద్దిసేపు ఓ పాటకు స్టెప్పులేశారు. అభిమానులు ఉద్రూతలూగి కేకలు, ఈలలతో అభినందనలు తెలిపారు.

దుర్గమ్మను దర్శించుకున్న ‘మండిపల్లి’



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

కడప కల్చరల్: రాష్ట్ర రోడ్డు రవాణా, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి, రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం కడపలోని శ్రీవిజయదుర్గమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ వారికి స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అర్చకులు అమ్మవారి విశిష్టతలను తెలిపి విశేష పూజలు చేసి హారతులు ఇచ్చారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ కుటుంబమంతా అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించేందుకు వచ్చామన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, భక్తులు పాల్గొన్నారు.

సౌమ్యనాథుని సన్నిధిలో రాష్ట్ర ఆడిట్ అధికారులు

నందలూరు: జిల్లాలో చరిత్రాత్మక, సుప్రసిద్ధ దేవాలయమైన నందలూరులోని శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయాన్ని శనివారం సాయంత్రం రాష్ట్ర ఆడిట్ ఏజీ అధికారులు సుమేద్ బోది, మహేశ్వరరాజులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. వీరితోపాటు జిల్లా పరిషత్ అధికారులు దేవదర్శన్ రెడ్డి, వరుణ్, ఎంపీడీఓ ప్రకాష్, సూపరింటెండెంట్ సుబ్రమణ్యంలు స్వామివారిని దర్శించుకున్నారు.

ఆధార్‌ను బ్యాంకు ఖాతాకు సీడ్ చేసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు 2019, 2020, 2021, 2022 సంవత్సరంలో ఎంపికై ఈ ఏడాది 9,10,11,12 తరగతులు చదువుతూ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో రెన్యువల్ చేసుకున్నప్పటికీ విద్యార్థులు ఆధార్‌ను బ్యాంకు ఖాతాకు సీడ్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిణి మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఆధార్‌ను బ్యాంకు ఖాతాకు సీడ్ చేయని కారణంగా స్కాలర్‌షిప్ జమ కాని వారి వివరాలను ప్రభుత్వ పరీక్ష కార్యాలయం www.bse.ap. gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఆమె తెలిపారు. ఆ జాబితాలో పేరు ఉన్న వారు వెంటనే తన బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ చేయించుకుని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా నగదు జమ అయ్యే విధంగా ఏర్పాటు చేసుకోవాలని, లేకపోతే స్కాలర్‌షిప్ జమ కాదన్నారు. మెరిట్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, విద్యార్థి లాగిన్‌లోని స్టేటస్ తీసుకుని సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఆధార్ సీడ్ చేయమని అడిగి చేయించుకోవాలని చెప్పారు. న్యూఢిల్లీ విద్యామంత్రిత్వశాఖ విద్యార్థి ఆధార్ నంబర్‌కు సీడ్ అయిన బ్యాంకు ఖతాకు డీబీటీ విధానంలో స్కాలర్‌షిప్ జమ చేయనున్నట్లు డీఈఓ తెలిపారు.

టీడీపీ అరాచకం..!

- గ్రామాలు వదిలి వెళ్లాల్సిందిగా మౌఖిక ఆదేశాలు
- వ్యక్తిగత ఆస్తులు, వ్యాపార, ఆదాయ వనరులను దెబ్బతీస్తున్న వైనం
- శరవేగంగా తెరపైకి వస్తున్న కక్షసాధింపు చర్యలు
- పొజిషన్ సర్టిఫికేట్ జారీకి కూడా సిఫార్సులు కావాల్సిందే



సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీకి మెజార్టీ సీట్లు దక్కాయని తెలుసుకోవడంతోనే తెలుగుతమ్ముళ్లు పేట్రేగిపోయారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ పాళ్లు తగ్గుతాయని పరిశీలకులు భావించగా, మరింత ఎక్కువయ్యాయి. గ్రామాలు వదిలివెళ్లాల్సిందిగా కొంతమంది ఆదేశిస్తే, ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టే చర్యలకు మరికొందరు సిద్ధమయ్యారు. ఈక్రమంలో వ్యక్తిగత ఆస్తులు, వ్యాపార, ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టి వేటేస్తున్నారు. మునుపెన్నడూ లేని దౌర్జన్యకర చరిత్రను లిఖిస్తున్నారు. రాజకీయ వైరి పక్షాలను టార్గెట్ చేస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు.

ప్రజాస్వామ్యంలో ఐదేళ్లకు ఓసారి ప్రజాతీర్పు తప్పదు. ప్రజాభీష్టం మేరకు పాలక పక్షాలు కొలువులోకి రానున్నాయి. ఈ క్రమంలోనే తెలుగుదేశం పార్టీకి ప్రభుత్వ పగ్గాలు దక్కాయి. దీంతో మునుపెన్నడూ లేని విధంగా దౌర్జన్యకర ఘటనలు తెరపైకి వస్తున్నాయి. ప్రధానంగా జిల్లాలో జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం ప్రాంతాల్లో కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఈక్రమంలో ప్రైవేటు పాఠశాలలను మూసేయాల్సిందిగా కొందరు ఆదేశిస్తున్నారు. నిర్వాహకులు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చారనే భావనే అందుకు కారణంగా నిలుస్తోంది. కమలాపురం, వల్లూరు, సింహాద్రిపురం ఏరియాల్లో ఇలాంటి వ్యవహారం బహిర్గతమైంది.

మరోవైపు అధికారులను ప్రయోగించి వ్యక్తిగత వ్యాపారాలను దెబ్బతీస్తున్నారు. గ్రామాలు వదిలి వెళ్లాల్సిందిగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు ఫోన్లు చేసి బెదిరిస్తున్న ఘటనలు సైతం చోటుచేసుకుంటున్నాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకొని వైరిపక్షాల ఆర్థిక మూలాలను దెబ్బతీయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అందులో భాగంగానే ముద్దనూరు మండల మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి క్రషర్ సీజ్‌కు దారితీసినట్లు పలువురు వివరిస్తున్నారు. చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లెలో సర్పంచ్ శ్రీనివాసులకు చెందిన ప్రవేటు భూమిని ఆక్రమించి, నర్సరీని ట్రాక్టర్లతో మిల్లర్ కొట్టారు. కోర్టు పరిధిలో ఉన్న భూమి సైతం స్వాధీనం చేసుకున్నారు. టీడీపీ వర్గీయులు పట్టపగలు యధేచ్ఛగా ఈ చర్యలకు పాల్పడ్డారు. ఇలాంటి దౌర్జన్యకర ఘటనలు మునుపెన్నడూ లేకపోగా, ఈమారు క్రమం తప్పకుండా తెరపైకి వస్తుండడం విశేషం.

అధికారులపై కర్రపెత్తనం

అధికారంలోకి వచ్చీ రాగానే తెలుగుదేశాధీశులు కర్రపెత్తనం ఆరంభించారు. మాకు తెలియకుండా చిన్న సంతకం కూడా చేయరాదంటూ మండల స్థాయి అధికారులకు హుకుం జారీ చేశారు. పొజిషన్ సర్టిఫికేట్ ఇస్తే హౌసింగ్ లోన్ తెచ్చుకుంటానని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆశ్రయించిన ఓ వ్యక్తికి అధికారుల నుంచి చేదు అనుభవం ఎదురైంది. టీడీపీ నేత ఫోన్ లేదా సిఫార్సు లేఖ ఏదో ఒకటి కావాలని ఆ అధికారి కోరడం గమనార్హం. గడిచిన ఐదేళ్లు కులాలకు, మతాలకు రాజకీయ పార్టీలకతీతంగా ప్రభుత్వ పాలన అందింది. అయితే నేడు భిన్నమైన పరిస్థితులు తెరపైకి వస్తున్నాయి. ఇలాంటి చర్యలను ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాల్సిన ఆవశ్యకత ఉంది. అధికార యంత్రాంగం సైతం ప్రోత్సహించడం ఆక్షేపణీయమని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రతిభా అవార్డులకు దరఖాస్తులు

కడప స్పోర్ట్స్: భారతదేశ ప్రభుత్వం, హోంమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 2025 జనవరి 26 రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా క్రీడలతో పాటు ఇతర రంగాల్లో ప్రత్యేకమైన ప్రతిభ కనబరిచిన వారికి ‘ప్రతిభా అవార్డులు’ అందజేయనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి తెలిపారు. ఆర్ట్స్ (కళలు); లిటరేచర్, విద్య, స్పోర్ట్స్, మెడిసిన్, సివిల్ సర్వీసెస్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీస్ అంశాల్లో ప్రతిభ కలిగినవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఆసక్తికలిగినవారు సదరు అంశానికి సంబంధించిన వివరాలు 800 పదాలకు మించకుండా నిర్ణీత ప్రొఫార్మాలో దరఖాస్తును జతపరిచి నామినేషన్లు వ్యక్తిగతంగా లేదా నేరుగా ఆన్‌లైన్ ద్వారా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పద్మఅవార్డ్స్.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సదరు వివరాలను స్పోర్ట్స్‌ఇన్ఏపీ జీమెయిల్ లేదా డీఎస్ఏ.కడప రెడిఫ్ మెయిల్‌కు జూలై 15వ తేదీలోగా పంపాలని కోరారు.

బైక్, బొలేరో ఢీకొని యువకుడికి గాయాలు


గాయపడ్డ అరుణ్‌కుమార్

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై శనివారం బైక్, బొలేరో వాహనం ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గున్నికుంట్ల పంచాయతీ దళితవాడకు చెందిన యం.అరుణ్‌కుమార్ సొంత పనుల నిమిత్తం కలకడకు ద్విచక్ర వాహనంలో వెళ్తున్నాడు. మార్గంమధ్యలోని మొటుకువాండ్లపల్లె క్రాస్ సమీపంలో ఈ బైక్, అటు వైపు నుంచి వస్తున్న బొలేరో వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అరుణ్‌ని స్థానికుల సాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆర్.ఓ.సి.నెం.945/2021/ఏ1 — కడప నగరపాలక సంస్థ, తేది: 15-06-2024

బహిరంగ వేలం ప్రకటన

ఇందు మూలముగా యావన్మంది ప్రజలకు తెలియజేయడం ఏమనగా కడప నగరపాలక సంస్థకు చెందిన 17వ వార్డులోని పాత కూరగాయల మార్కెట్, 20వ వార్డులోని క్రొత్త కూరగాయల మార్కెట్ 15వ వార్డులోని గొర్రెల మేకల వధశాల, ఎద్దుల వధశాల, గొర్రెల & మేకల మాంసం అంగళ్ళు, మరియు ఎద్దుల మాంసం అంగళ్ళునకు గౌరవ స్టాండింగ్ కమిటీ వారి తీర్మానం నెం.502, తేది: 02-03-2024 మేరకు మరియు శ్రీయుత జిల్లా కలెక్టర్ వారి గెజిట్ నెం.61/2024, తేది: 05.03.2024 మేరకు మరియు కార్పొరేషన్ వారి షరతుల మేరకు గుత్తలకు 2024 - 2025 ఆర్థిక సంవత్సరానికి (9 నెలలకు) సంబంధించి **తేది:24-06-2024 సోమవారము** కడప నగరపాలక సంస్థ సమావేశపు భవనము నందు ఉదయం 10:00 గంటలకు క్రొత్త కూరగాయల మార్కెట్, జంతు వధశాలలు మరియు మాంసపు అంగళ్ళు మరియు అదే రోజు మధ్యాహ్నం 03.00 గంటలకు పాత కూరగాయల మార్కెట్‌నకు బహిరంగ వేలం వేయబడును. కావున సదరు వేలములో పాల్గొనదలచిన వారు ఈ క్రింద కనబరచిన ప్రకారము సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో పాటు వేలం డిపాజిట్ (డిపాజిట్ ను పే ఆర్డర్/ బ్యాంకు చెక్కు/ డి.డి రూపములో మాత్రమే) గుత్తల వారిగా సపరేటుగా చెల్లించి సంబంధిత దరఖాస్తులను **తేది:22-06-2024 (శనివారము)** సాయంత్రం 5:00 గంటల లోపు సమర్పించవలెను. క్రింద తెలిపిన గుత్తలకు సంబంధించి వేరు వేరుగా వేలం నిర్వహించబడును. సదరు వేలము నందు డిపాజిట్ చెల్లించిన వారిని మాత్రమే అనుమతించబడును. ఇతరులు అనుమతించబడరు. సదరు వేలము నందు పాల్గొనదలచినవారు ఇంటి, నీటి పన్నులు బకాయిలు పెండింగ్ లేకుండా చెల్లించవలయును మరియు గత కాంట్రాక్టులకు సంబంధించిన కిస్తులు, స్టాంపు డ్యూటీ చెల్లింపులు, సర్వీస్ టాక్స్ లు మరియు ఇతర బకాయిలు వున్నచో అటువంటి వారు సదరు వేలములో పాల్గొనుటకు అర్హులు కారు. ఒకవేళ అటుల బకాయిలు వున్నచో సదరు బకాయిలు అన్నియు పూర్తిగా నగరపాలక సంస్థ యందు చెల్లింపుచేసి బకాయిలు ఏమియును లేనట్లు నగరపాలక సంస్థ కడప వారి ద్వారా "నో డ్యూ సర్టిఫికేట్" పొంది సదరు వేలములో పాల్గొనవలసి యుండును.

క్రమ సంఖ్య	గుత్త వివరములు	చెల్లింపు చేయవలసిన డిపాజిట్	సమర్పించవలసిన సర్టిఫికెట్ విలువ
1	2	3	4
1	17వ వార్డు నందు గల పాత కూరగాయల మార్కెట్	రూ.3,50,000/-లు	రూ.5,00,000/-లు
2	20 వ వార్డు నందు గల క్రొత్త మార్కెట్	రూ.10,000/-లు	రూ.1,00,000/-లు
3	15వ వార్డు నందు గల గొర్రెల మేకల వధశాల	రూ.10,000/లు	రూ.2,00,000/-లు
4	ఎద్దుల వధశాలలు	రూ.10,000/-లు	రూ.1,00,000/-లు
5	ఎద్దుల మాంసపు అంగళ్ళు	రూ.10,000/-లు	రూ.1,00,000/-లు
6	గొర్రెల & మేకల మాంసపు అంగళ్ళు	రూ.10,000/-లు	రూ.1,00,000/-లు

పై తెలిపిన కాలము నెం.03 గల డిపాజిట్ ను పే ఆర్డర్/బ్యాంకు చెక్కు/ డి.డి రూపేన కార్పొరేషన్ నందు చెల్లించిన రశీదులు సమర్పించవలెను. హెచ్చుపాట పాడిన గుత్తదారుడు వేలం ముగిసిన పిదప డిపాజిట్ తో కలిపి సదరు హెచ్చుపాట పాడిన మొత్తములో 1/4 అనగా 25% శాతం. మిగిలిన 3/4 మొత్తమునకు అనగా 75% నకు 6 ముందస్తు తేదీలు గల చెక్కులను సమర్పించవలసి ఉంది. ప్రతినెల కంతులుగా క్రమం తప్పకుండా చెల్లించవలెను. ముందస్తు తేదీలు గల చెక్కులను సమర్పించని యెడల గుత్త రద్దు పరచబడును. ప్రతినెల 05 వ తేదీ లోగా నెల కంతులు చెల్లించవలయును. హెచ్చుపాట మొత్తమునకు జి.యస్.టి. గుత్తదారుడే చెల్లించుకుంటు మరియు గుత్త కాలమునకు సంబంధించిన అగ్రిమెంట్‌ను తన సొంత ఖర్చులతో రిజిస్టర్ వారి కార్యాలయములో రిజిస్టర్ చేయవలెను. అగ్రిమెంట్ చేయుంటలో జాప్యము జరిగినను మరియు షరతులు ఉల్లంగించినను కేటాయించిన కాలపరిమితి అనగా తేది:01-07-2024 నుండి 31-03-2025 వరకు గుత్తను స్వాధీనము చేయబడదని తెలియజేయడమైనది. ఏమైనా అనివార్య కారణములతో సదరు వేలమును వాయిదా లేక రద్దు పరుచుటకు కమీషనర్ గారికి మాత్రమే పూర్తి అధికారము కలదు. ఇతర వివరములకు నగరపాలక సంస్థ రెవిన్యూ విభాగము నందు కార్యాలయపు పనివేళలో సంప్రదించి తెలుసుకొనవలసినదిగా తెలియజేడమైనది.

సం/- జి. సూర్య సాయి ప్రవీణ్‌చంద్, I.A.S., కమీషనర్, కడప నగరపాలక సంస్థ.

వారపు సంత స్థలాలు కబ్జా


వారపు సంత స్థలాలు కబ్జాకు గురైన దృశ్యం


వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారులు

- దుకాణదారులకు తప్పని ఇబ్బందులు
- తగ్గుతున్న పంచాయతీ ఆదాయం
- చోద్యం చూస్తున్న అధికారులు

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో రూ.50 లక్షల విలువ చేసే వారపు సంత స్థలాలు కబ్జాకు గురయ్యాయి. దీంతో వారపు సంతలో దుకాణాలు నిర్వహించలేక వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు స్థలాలు కబ్జా అవుతుండటంతో ఏటా నిర్వహించే వారపు సంత వేలం పాటలు కాంట్రాక్టర్లు తక్కువకు పాడుకొంటున్నారు. దీంతో పంచాయతీ ఆదాయానికి లక్షలాది రూపాయల గండి పడుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తూ కాలం వెళ్లదీస్తుండటం గమనార్హం.

చుట్టుపక్కల ప్రాంతాల నుంచి..

పట్టణంలో నడిబొడ్డున కడప–బెంగళూరు జాతీయ రహదారి పక్కనే వారపు సంత నిర్వహిస్తున్నారు. సుమారు 15 వేల జనాభా ఉన్న పట్టణంలో ఎంతో విశాలంగా ఉండే ఈ వారపు సంతకు చుట్టుపక్కల 10 మండలాల నుంచి వ్యాపారులు, ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు సంత నిర్వహిస్తుంటారు.

నిబంధనలకు తూట్లు

ఇప్పటికే బస్టాండులో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయి. ప్రస్తుతం పలువురు లక్షలాది రూపాయలు విలువచేసే వారపు సంత స్థలాలు కబ్జా చేశారు. నిబంధనల మేరకు వారపు సంతలో దుకాణాలు నిర్వహించుకొనే వారే.. సంత రోజు ఇక్కడ దుకాణాలు నిర్వహించుకోవాల్సి ఉంటుంది. అయితే కొంత మంది ఆక్రమణదారులు శాశ్వత ప్రాతిపదికన రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకొని వారపు సంత స్థలాలు కబ్జా చేస్తున్నారు. కొంత మంది నాయకులు దగ్గరుండి మరీ ఈ ఆక్రమణలు ప్రోత్సహిస్తుండటం గమనార్హం. దీంతో వారపు సంత రూపురేఖలు మారిపోయాయి.

కడప–బెంగళూరు రహదారిపై..

పట్టణం నడిబొడ్డులో ఉన్న వారపు సంత స్థలాలు రోజురోజుకు కబ్జాకు గురవుతుండటంతో ఇరుకుగా మారింది. దీంతో వ్యాపారులు వారపుసంతను వదిలిపక్కనే ఉన్న కడప–బెంగళూరు జాతీయ రహదారిపై దుకాణాలు నిర్వహిస్తున్నారు. రహదారికి ఇరువైపులా బస్టాండు వరకు దుకాణాలను నిర్వహిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

షెడ్లు లేక వ్యాపారస్తుల కష్టాలు

లక్షలాది రూపాయల ఆదాయం సమకూరుతున్నా మేజర్ పంచాయతీ వారపు సంతలో కనీసం షెడ్లు కూడా లేక పోవడంతో వ్యాపారస్తులు నానా కష్టాలు పడుతున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వ్యాపారాలు చేసుకోవాల్సి వస్తోందని వ్యాపారులు వాపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వారపు సంతలో ఇటు వ్యాపారస్తులు, అటు సామాన్య ప్రజలు తడిసిపోతు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో షెడ్లు నిర్మించాలనే ప్రతిపాదన పంచాయతీ పాలక వర్గం తీర్మానించినా అది ఏళ్ల తరబడి ఆచరణకు నోచుకోక పోవడం గమనార్హం.

అధికారులకు ఫిర్యాదు చేసినా..

ఓ వైపు బస్టాండులో కోట్లాది రూపాయల ప్రభుత్వ స్థలాలు, మరోవైపు లక్షలాది రూపాయల విలువ చేసే వారపు సంత స్థలాలు కబ్జాకు గురువుతున్నా.. సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పలుమార్లు గ్రామస్తులు రెవెన్యూ, మండల, పోలీస్ అధికారులకు కబ్జాలపై ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు ఒకరిపై ఒకరు సాకులు చెప్పుకొంటూ కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నోటీసులు ఇస్తూనే ఉన్నాం



పంచాయతీలోని ప్రభుత్వ, వారపు సంత స్థలాలను కబ్జా చేస్తున్న వారికి నోటీసులు ఇచ్చాం. అయితే నోటీసులకు ఎలాంటి స్పందన రావడం లేదు. సమస్యపై రెవెన్యూ, పోలీసులతో చర్చించాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అందరి సహకారంతో కబ్జాలపై చర్యలు తీసుకొంటాం.
– విశ్వనాథ్, పంచాయతీ ఈవో, గుర్రంకొండ

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట


పెన్నాకు వెళ్లే మార్గంలో జేసీబీ యంత్రంతో గోతులు తీస్తున్న దృశ్యం

సిద్దవటం : పెన్నా నది నుంచి ఇసుక అక్రమ రవాణా జరగకుండా అడ్డుకట్ట వేశామని సిద్దవటం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో స్టేషన్ సీఐ నాగరాజు తెలిపారు. డేగనవాండ్లపల్లె గ్రామం వద్ద పెన్నానదిలోకి వెళ్లే రహదారిలో శనివారం జేసీబీ యంత్రంతో గోతులు తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని డేగనవాండ్లపల్లె గ్రామ సమీపంలోని పెన్నా నది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తూ వేల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇసుక రవాణాపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చే వరకు ఇసుక రవాణా జరగకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో చంద్ర, రెవెన్యూ సిబ్బంది, ఎన్‌ఫోర్స్‌మెంటు సిబ్బంది పాల్గొన్నారు.

కంప చెట్లలో గుర్తుతెలియని మృతదేహం




చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని మామిళ్ళపల్లె పంచాయతీ సమీపంలో గల సోమయాజులపల్లి గ్రామం వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు ఏఎస్‌ఐ నాగరాజు శనివారం తెలిపారు. సోమయాజులపల్లి గ్రామానికి ఉత్తరం వైపున కంప చెట్లలో అనుమానాస్పదంగా ఉన్న మృతదేహాన్ని పశువుల కాపర్లు గుర్తించి తమకు సమాచారం అందించారని ఆయన పేర్కొన్నారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించినట్లు చెప్పారు. మృతుడు కాఫీ రంగు లుంగిపై సబ్బురంగు చుక్కల డిజైన్‌తోపాటు మెరూన్ రెడ్ ఫుల్ షర్టు, బ్లూ రంగు గల ఫుల్ డ్రాయర్‌తో ఉన్నాడని తెలిపారు. అతని వయసు 35 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన ప్రసాద్

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో మండలంలోని టి.చదిపిరాళ్ల గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంతో చింతకుంట ప్రసాద్ (44) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముద్దనూరు మండలం ఒంటిగారిపల్లెకు చెందిన ప్రసాద్ కడపలోని అక్కాయపల్లెలో నివాసం ఉంటూ కడప నగర పాలక సంస్థలో పీహెచ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ప్రసాద్ తన మోటార్ బైక్‌లో ఎర్రగుంట్ల వైపు నుంచి కడప వైపు వెళ్తున్న క్రమంలో చదిపిరాళ్ల వద్దకు రాగానే రోడ్డు దాటుతున్న సత్యం అనే వ్యక్తిని ఢీకొన్నాడు. ఈ ఘటనలో ప్రసాద్ కింద పడ్డాడు. ముఖానికి బలమైన గాయం అయింది. అలాగే సత్యంకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కమలాపురం 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి ప్రసాద్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా ప్రసాద్‌కు భార్య ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిసింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సత్యం అనే వ్యక్తికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు వివరించారు.

విద్యుత్ ఘాతంతో..


మృతి చెందిన గేదె

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని ముదినేపల్లి గ్రామ సమీపంలో శనివారం విద్యుత్ తీగలు తగిలి గేదె మృతి చెందింది. కటికంవారిపల్లి గ్రామానికి చెందిన అరిగెల వెంకటయ్య రోజూ గేదెలను తోలుకుని వెళ్లి ముదినేపల్లి గ్రామం పై పక్క ఉన్న పంట పొలాలలో మేపుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం గాలేరు–నగిరి మట్టికట్టపై గేదెలు వెళ్లడంతో విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే ఒక గేదె మృతి చెందింది.

కురబలకోటలో చోరీ

కురబలకోట : మండల కేంద్రం కురబలకోటలో పి.శ్రీనివాసులు ఇంటిలో 42 గ్రాముల బంగారు నగలు చోరీకి గురైనట్లు శనివారం ముదివేడు పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధిత కుటుంబీకులు రెండు రోజుల క్రితం మదనపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లారు. శనివారం వచ్చి చూస్తే ఇంటి బీరువాలోని నగలు కన్పించలేదని వారు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటి వెనుక నుంచి వచ్చి ఈ చోరీ చేసినట్లు చెబుతున్నారు. క్లూస్ టీం నమూనాలు సేకరించింది. రూరల్ సర్కిల్ సీఐ సద్గురుడు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న సోలార్ ఏరియా మేనేజర్ విజయ్ ప్రకాష్

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యాభివృద్ధికి హెచ్‌ఎంలతోపాటు ఉపాధ్యాయులు కృషి చేయాలని సెల్‌కో సోలార్ ఏరియా మేనేజర్ విజయ్ ప్రకాష్ అన్నారు. జిల్లాలోని 40 హైస్కూళ్లకు టెక్నిక్ పార్టనర్ సెల్‌కో సోలార్ లైట్ ప్రైవేటు లిమిటెట్ అండ్ ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ సతి ప్రాజెక్టు అండ్ కన్సన్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోలార్ ప్యానెల్, స్మార్ట్ టీవీ, ఇన్వర్టర్, బ్యాటరీ ఇవ్వడం జరిగింది. ఈ పాఠశాలలకు చెందిన 40 మంది హెచ్‌ఎంలకు శనివారం కడప చెమ్మమియాపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మేరీ ఆధ్వర్యంలో వాటి నిర్వహణపై సెల్‌కో సోలార్ ఏరియా మేనేజర్ విజయ్ ప్రకాష్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల అభివృద్ధికి సోపానాలన్నారు. డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ టెక్నిక్ పార్టనర్ సెల్‌కో సోలార్ లైట్ ప్రైవేటు లిమిటెట్ అండ్ ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ సతి ప్రాజెక్టు అండ్ కన్సన్స్ ఆఫ్ ఇండియా వారు ఇచ్చిన వస్తువులను జాగ్రత్తగా వినియోగించి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ ధనలక్ష్మి, వేముల జెడ్పీ హైస్కూల్ పీడీ సీవీఎస్ రాయుడు, ఎల్‌ఐసీ సీఎల్‌ఐఏ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ కేసుల రాజీ కోసం కృషి చేయాలి


కడప అర్బన్ : న్యాయవాదులతో సమావేశం నిర్వహిస్తున్న న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు


రాయచోటి టౌన్ : అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

కడప అర్బన్ : జిల్లాలో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేయాలని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు తెలియజేశారు. శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి సూచనల మేరకు మెదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ ఆధ్వర్యంలో కడపలోని జిల్లా కోర్టు హాల్‌లో ముందస్తు లోక్ అదాలత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈఓపీ అడ్వకేట్లతోపాటు, ఇతర న్యాయవాదులందరూ ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేయాలన్నారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్లు: 08562- 258622, ఈమెయిల్ అడ్రస్: కెడిఎపిఎ.డిసిజఆర్‌టిఎస్.జివొవి.ఐఎన్, డిఎల్ఎస్ఏ కెడిపి అట్‌దిరేటాఫ్ జీమెయిల్ డాట్ కామ్‌ను సంప్రదించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం కడప అధ్యక్షుడు బి.గుర్రప్పనాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

రాయచోటి టౌన్ : లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొనే విధంగా అధికారులు ప్రజలకు తెలియజేయాలని జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి సూచించారు. శనివారం రాయచోటి కోర్టు ఆవరణలో అధికారులు, న్యాయవాదులతో లోక్ అదాలత్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో అన్ని రకాల క్రిమినల్, ప్రమాదాల కేసులు, సివిల్, ఎంఈవో వంటి కేసులు పరిష్కరించుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి జీసీఏ సుల్తానా, అడిషనల్ మెజిస్ట్రేట్ డాక్టర్ కె.శారద, తదితరులు పాల్గొన్నారు.

డీటీ చుట్టూ తిరుగుతున్న అవినీతి చక్రం!

వీఆర్‌ఏ, వీఆర్వోలకు అందని ఎన్నికల ఖర్చు డబ్బులు

జమ్మలమడుగు : పట్టణంలోని డీటీ చుట్టూ తిరుగుతోంది ఎన్నికల అవినీతి చక్రం. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల ఖర్చు నిమిత్తం జమ్మలమడుగు నియోజకవర్గానికి కోటి 62 లక్షల రూపాయలు మంజూరు చేసింది. ఆ డబ్బులను ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బంది, వారి భోజనాలకు ఇవాల్సి ఉంది. అలాగే కవరేజ్ చేసే మీడియా ప్రతినిధులకు వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. అయితే డీటీ మాత్రం ఎన్నికల డ్యూటీలో పాల్గొన్న ఉద్యోగులకు కనీసం ఒక్క పూట భోజనం గానీ, మంచినీరు కూడా పోయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మీడియా ప్రతినిధులకు కూడా కనీసం గ్లాసు మంచినీరు పోయని ఎన్నికల రెవెన్యూ అధికారులు.. వారికి భారీగా ఖర్చు పెట్టామంటూ చెబుతున్నట్లు తెలుస్తోంది. మండలంలో వీఆర్‌ఏలు 20 మంది వరకు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఎన్నికలకు సంబంధించిన విధులు నిర్వహించారు. అంతేకాకుండా ఎన్నికలకు సంబంధించిన సామగ్రి, కుర్చీలు, టేబుల్స్ కొనుగోలు చేశారు. అవి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి ఉంది. లగ్జరీ కుర్చీలను మోరగుడి గ్రామంలో తనకు అనుకూలంగా ఉన్న ఓ మహిళ ఇంట్లో డీటీ పెట్టారని వీఆర్‌ఏలు ఆరోపిస్తున్నారు.

వీఆర్వోలకు సైతం కుచ్చుటోపి...

మండల వ్యాప్తంగా 20 మంది వీఆర్వోలు వివిధ రకాల డ్యూటీలు నిర్వహించారు. దాదాపు 60 రోజుల వరకు విధులను నిర్వర్తించారు. వారికి ఒక్కొక్కరికి రూ.20 వేల వరకు రావాల్సి ఉంది. ఎన్నికల ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నిధులను విడుదల చేసినా.. ఇంత వరకు ఒక్కరికి కూడా ఐదు పైసలు ఇవ్వలేదని వీఆర్వోలు వాపోతున్నారు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో విధులు నిర్వహించే ఆర్డీఓ కార్యాలయ ఉద్యోగులకు భోజనాలు స్థానికంగా కాకుండా ప్రత్యేకంగా ప్రొద్దుటూరు నుంచి తెప్పించడంపై పలువురు ఉద్యోగులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఎన్నో మంచి హోటల్స్ ఉండగా ప్రొద్దుటూరు నుంచి తెప్పించడం వెనుక.. అక్కడి హోటల్ యజమానులతో కమీషన్ మాట్లాడుకుని నాసిరకం భోజనం సరఫరా చేశారంటూ విమర్శలు చేస్తున్నారు. కోటి అరవై లక్షల రూపాయలలో ఎక్కువ భాగం డీటీ అవినీతికి పాల్పడినట్లు రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులతోపాటు, ఉద్యోగులు వేలు ఎత్తి చూపుతున్నారు. ఉన్నతాధికారులు సైతం ఈ విషయంపై మాట్లాడటానికి ఇష్టపడటం లేదు. ఆర్డీఓ శ్రీనివాసులు మాత్రం తాను ఆర్వోగా కేవలం ఎన్నికల నిర్వహించడమే తన బాధ్యత తప్ప, ఎన్నికల ఖర్చుల గురించి తనకు ఎటువంటి సంబంధం లేదంటూ దాటేస్తున్నారు.

ఆప్కాస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప అర్బన్ : రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖలలో ఆప్కాస్ విధానంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఆప్కాస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వెంకటసుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆప్కాస్ విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు లక్ష 16 వేల మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరికి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల తరహాలోనే వీరిని పర్మినెంట్ చేయాలన్నారు. వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని వివరించారు.

జనావాసంలోకి దేవాంగ పిల్లి


దేవాంగ పిల్లిని పట్టుకున్న స్థానికులు, అధికారులు

పీలేరు : అత్యంత అరుదుగా కనిపించే దేవాంగ పిల్లి స్థానిక ఎన్‌టీఆర్ కాలనీలో జనావాసంలోకి రావడంతో స్థానికులు గుర్తించారు. శనివారం ఎన్‌టీఆర్ కాలనీలో దేవాంగ పిల్లిని గుర్తించిన స్థానికులు పి.రామాంజులు, మౌనిక, రెడ్డిప్రసాద్ సమాచారాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. అటవీ క్షేత్రాధికారి బి.రామ్లానాయక్ దేవాంగ పిల్లిని పరిశీలించి తమ సిబ్బందిచే తలపుల అటవీప్రాంతంలో వదలిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్

కడప అర్బన్ : విద్య ఎంతో విలువైనదని, క్రమశిక్షణతో అభ్యసించాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ అన్నారు. శనివారం కడపలోని బాలుర వసతి గృహాన్ని జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో జడ్జి తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. పిల్లలు ఏ తరగతులను అభ్యసిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, వంటశాలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికారసంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవలు పథకం 2015ను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. పిల్లల విద్యా, ఆరోగ్య విషయాల పట్ల తగిన జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికారసంస్థ, కడప వారి దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర గృహం సూపరింటెండెంట్ వీరయ్య, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, వైద్యురాలు పాల్గొన్నారు.

ఆ చట్ట సవరణను రద్దు చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ప్రభుత్వం రద్దు చేయడం హర్షణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిషేధిత భూముల 22ఏ చట్ట సవరణను కూడా రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేసీ బాదుల్లా, నాయకులు లింగన్న, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

'ఆ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి'

కడప కోటిరెడ్డిసర్కిల్ : వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగిగా పని చేస్తూ సంఘ నాయకుడిలా చలామణి అవుతున్న కేఆర్ సూర్యనారాయణపై ఉన్న కేసులను క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు చేపట్టడంతోపాటు ఇతని సంఘం గుర్తింపును రద్దు చేయాలని ది కమర్షియల్ ట్యాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కడప డివిజన్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ కోరారు. స్థానికంగా ఆయన శనివారం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన అభియోగంపై శాఖాపరమైన నివేదిక ఆధారంగా ప్రభుత్వం సూర్యనారాయణపై సస్పెన్షన్ వేటు వేసిందన్నారు. అందుకు సహకరించిన ఇతర ఉద్యోగులను కూడా సస్పెండ్ చేసిందని, వారంతా జైలుపాలు కాగా, సూర్యనారాయణ అజ్ఞాతంలోకి వెళ్లి అరెస్టు కాకుండా స్టే తెచ్చుకున్నారన్నారు. అధికారులను బ్లాక్ మెయిల్ చేసేందుకు నూతన ముఖ్యమంత్రితో ఫొటోలు దిగి కొత్త డ్రామాలకు తెరతీస్తున్నారన్నారు. తన సంఘానికి ఓడీ సౌకర్యం లేకపోయినా ఇతర సంఘాలకు ఉన్న సౌకర్యాలను చట్ట విరుద్ధంగా పొందారని ఆరోపించారు. 2023లో సూర్యనారాయణ సంఘం సభ్యుల అక్రమాలపై.. విజయవాడలో వర్తకులు తమను వేధిస్తున్న విధానాలపై ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు.

పాఠశాల వేళకు బస్సు సౌకర్యం కల్పించాలి

గాలివీడు : తలముడిపి, కొర్లకుంట, పందికుంట గ్రామాల విద్యార్థులు నూలివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి చదుకోవడానికి బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పాఠశాల వేళకు బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌ను ఆ అసోసియేషన్ నాయకులు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ట్రెజరర్ నాగార్జున గుప్తా, సభ్యులు పాల్గొన్నారు.